

టమాటా.. లాభాల బాట
టమాటా అన్ని కాలాల్లో పండించే ముఖ్యమైన పంట. మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఏడాదంత కాస్తుండటంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వివరాలు 8లో ▸



పంట రక్షణకు పాట్లు
పంటల సాగులో జంతువుల బెడద తప్పడం లేదు. పంటలను కాపాడుకునేందుకు అనేక రకాలుగా రక్షణ చర్యలు చేపడుతున్నారు. వివరాలు 8లో ▸



అలంకారప్రాయం
రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లు వెలగడంలేదు. అధికారులు పట్టించుకోక పోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సీఎం దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం తెచ్చి పదేళ్ల అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ పై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు రూ.కోటి నిధులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని అక్కన్నపేట గ్రామానికి రూ.20లక్షలు, గౌరవెల్లికి రూ.15లక్షలు, ముంపు గుడాటిపల్లికి రూ.15లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే అంతక్కపేటకు రూ.10లక్షలు, జనగామ గ్రామానికి రూ.10లక్షలు, మల్లంపల్లికి రూ.10లక్షలు, రామవరం గ్రామానికి రూ.10లక్షలు, చౌటపల్లి గ్రామానికి రూ.5లక్షలు, గొల్లకుంట గ్రామానికి రూ.5లక్షలు మంజూరయ్యాయన్నారు.

బీసీ హాస్టళ్ల తనిఖీ



వసతిగృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సరోజ

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలికల, బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని బీసీ హాస్టళ్లను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సరోజ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీసీ బాలికల కళాశాల వసతిగృహం, బాలికల ప్రీ మెట్రిక్, కళాశాల వసతి గృహాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చదువుల్లో రాణించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూ మురళీ, హాస్టల్ వార్డెన్లు లక్ష్మీ, దేవదాస్, జానకీరామ్ తదితరులున్నారు.

గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగుపరచండి

సిద్దిపేటరూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటుగా అన్ని గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి గాను ఖర్చుల అంచనాలను తయారు చేసి సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు డివిజన్లకు చెందిన గ్రామపంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు, బకాయిలను వెంటనే చెల్లించాల్సిందిగా జీపీలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు, మంచి నీటి వసతి, ఫ్యాన్లు, కుర్చీలు సమకూర్చాలన్నారు. అలాగే టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని సంస్థ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవిజినల్ పంచాయతీ అధికారులు, డీఈఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు పోటీలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఏదైనా ఒక అంశంపై మాత్రమే పాల్గొనాలని సూచించారు. పాఠశాల స్థాయి పోటీలు ఈనెల 6 తేదీన, మండల స్థాయి 7వ తేదీన, జిల్లాస్థాయి పోటీలు తొమ్మిదో తేదీన జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క పోటీ నుంచి ముగ్గురు చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ స్థానాలు పొందిన మొత్తం 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

చెట్టంతా పూత.. కాయాలి కాత

జిల్లాలో ఈయేడు మామిడి చెట్లకు పూత విరగబూసింది.. చెట్లు కళకళలాడుతున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అయితే పూత కాయలుగా మారుతాయోలేదోనన్న బెంగ రైతుల్లో నెలకొంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోకుండా అధిక దిగుబడులు రావాలని రైతాంగం కోటి ఆశలు పెట్టుకుంది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



బక్రిచెప్యాల శివారులో విరగబూసిన పూతతో మామిడిచెట్లు

ఎంఎల్‌హెచ్‌పీ ఇంటర్వ్యూలు పూర్తి

సిద్దిపేటరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిద్దిపేటలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఇంటర్వ్యూ ప్రక్రియను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో 5 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులు ఖాళీగా ఉండడంతో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు కలెక్టర్ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు ఎంపిక చేసి విధులు కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ చేస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

తియ్యగా.. మత్తుగా

గంజాయి ముఠా రూటు మార్చింది. గతంలో ఆకులు, పొగాకు రూపంలో విక్రయించగా, ఇప్పుడు చాక్లెట్లుగా అమ్మకాలు సాగిస్తోంది. గతంలో జులాయిగా తిరిగే వారు, ఓ వర్గం టార్గెట్ ఉండేది. ఇప్పుడు స్కూల్, కళాశాల విద్యార్థులను లక్ష్యం చేసుకుని చాక్లెట్లు విక్రయిస్తోంది. వారిని వ్యసనంగా మార్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తాజాగా చేర్యాల పట్టణంలోని ఓ పాన్ షాప్‌లో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ముఠా పట్టుబడటంతో జిల్లా వాసులు ఉలిక్కిపడ్డారు.

రూటు మార్చిన గంజాయి ముఠా
- చాక్లెట్ల రూపంలో జోరుగా విక్రయాలు
- విద్యార్థులు, యువకులు, కార్మికులే టార్గెట్
- అడ్డుకట్ట వేయకపోతే ప్రమాదమంటున్న జనం



ఇటీవల చేర్యాలలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు (ఫైల్)



గంజాయి చాక్లెట్ల ప్యాకెట్

సాక్షి, సిద్దిపేట: గంజాయిని నిర్మూలిస్తున్నామని ఏళ్ల తరబడిగా ఆబ్కారీ, పోలీసు అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మత్తు పదార్థాల విక్రయాలను కట్టడి చేయాలని సాక్షాత్తు సీఎం రేవంత్ ఆదేశించినా పకడ్బందీగా చర్యలు కానరావడంలేదు. జిల్లాలో పట్టుబడుతున్న గంజాయి ఘటనలే ఇందుకు నిదర్శనం. దీంతో జిల్లా వ్యాప్తంగా విక్రయాలు సాగుతున్నాయి. చాప కింద నీరులా ఈ మత్తు వ్యాపిస్తోంది. బానిసలుగా మారుతున్న యువకులు తమ జీవితాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు.

25 ఏళ్లలోపు వారే...

జిల్లాలో వ్యసన పరులుగా మారుతున్న వారిలో 25 ఏళ్లలోపు వారు, కళాశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యువకులు బానిసలుగా మారడటంతో తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఉపాధి నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలు సైతం ఎక్కువగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక్కో చాక్లెట్ రూ.40లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. జనవరి 31న చేర్యాలలోని ఓ పాన్‌షాప్‌లో బీహార్‌కు చెందిన రాకేశ్‌కుమర్ విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఒక్కో చాక్లెట్‌లో సమారుగా 20 శాతం వరకు గంజాయి ఉన్నట్లు సమాచారం. 6 కిలోల పరిమాణంలో 1200 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ చాక్లెట్ల పై శ్రీ మహంకాళి మక్కోన వటి అని పేరుతో విక్రయాలు సాగుతున్నాయి. ఆయుర్వేదిక్ మందు కోడ్‌తో విక్రయిస్తుండటం గమనార్హం.

రద్దీ లేని ప్రాంతాలే అడ్డాలు

సిద్దిపేట పట్టణంలో ఎక్కువగా రద్దీ ఉండని ప్రాంతాలే గంజాయి విక్రయదారుల అడ్డాలుగా మారినట్లు తెలుస్తోంది. రంగనాయకసాగర్ కట్ట పైన, కోమటి చెరువు, సుడా రోడ్డు, సిరిసిల్ల, కరీంనగర్ రోడ్, పొన్నాల ఆటోనగర్ సమీప ప్రాంతాల్లో ఒక్కో సమయంలో ఒక్కో దగ్గరకు వ్యాపారులు వచ్చి గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారి వచ్చే సమయానికి గంజాయి సేవించే వారు, చాక్లెట్లు తినే వారు అక్కడికి చేరుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇతర రాష్ట్రాల నుంచి ఇటుక బట్టీలలో పని చేసే కార్మికులు, హోటళ్లలో పనిచేవారు, భవన నిర్మాణ కార్మికులు ఎక్కువగా గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. చాక్లెట్లు తిన్న యువత, సిగరేట్‌లో గంజాయి ఆకులను పెట్టుకుని తాగి మత్తులో తూగిపోతున్న సంఘటన కన్పిస్తున్నాయి.

అడ్డుకట్ట పడేదెప్పుడు?

ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గుట్టుచప్పుడు కాకుండా జోరుగా గంజాయి సరఫరా అవుతోంది. పల్లెల్లోకి సైతం పాకింది. ఏ ప్రాంతం నుంచి సరఫరా అవుతుంది? రవాణాకు సహకరిస్తున్న వారెవరు? వీరిని గుర్తిస్తే దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు దృష్టి సారించక దొరికిన వారిని రిమాండ్ చేసి వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు మూలాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకుంటేనే యువత, ప్రజలు మత్తు పదార్థాలకు బానిస పడకుండా ఉండే అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఘటనలు..
- జనవరి 13న సిద్దిపేట పట్టణంలోని సిరిసిల్ల రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు గంజాయి తీసుకువెళ్తూ పట్టుపడ్డారు. వారి వద్ద నుంచి 1.2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 11న కోహెడ మండలం ఆరెపల్లిలో కోముల్ అనే మహిళ ఇంటి ఆవరణలో పెంచుతున్న 26 గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. అలాగే 240 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- గతేడాది 14 గంజాయి కేసులు నమోదు కాగా 27 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిఘా సారించాం



ఇటీవల చేర్యాలలో చాక్లెట్ల రూపంలో గంజాయి పట్టు పడటంతో పాన్ షాప్ లపై ప్రత్యేకంగా నిఘాపెట్టాం. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు సైతం చేపడుతున్నాం. కళాశాలల వద్ద, పాత నేరస్తుల పై ప్రత్యేకంగా నిఘా పెట్టాం. గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాస మూర్తి, ఈఎస్, ఎక్సైజ్ శాఖ

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు షెడ్యూలు ఇలా..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫీజు షెడ్యూలు విడుదల అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 21వరకు ఎలాంటి ఫైన్ లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.25 ఫైన్‌తో ఈ నెల 27 వరకు, రూ.50 ఫైన్‌తో మార్చి 4 వరకు చెల్లించవచ్చని తెలిపారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి (80084 03635)ని సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: షెడ్యూల్ కులాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్యను అందించేందుకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్ కులాలు అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి రూ.42,000 చెల్లిస్తామన్నారు. హాస్టల్ వసతి లేని పాఠశాలలకు డే స్కాలర్లుగా కేటాయించి వారికి ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఫీజు రూ.25,000, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.28,000 చెల్లిస్తామన్నారు. దరఖాస్తులు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైతు రుణమాఫీ వెంటనే చేయాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం వెంటనే రైతు రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి, వరి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించాలని కోరారు. పత్తి మిల్లుల్లో జిన్నింగ్ సాఫీగా జరిగే విధంగా చూడాలన్నారు. రైతు భరోసా వెంటనే చెల్లించి పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పత్తి విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసి కల్తీ విత్తనాలను అరికట్టాలని పేర్కొన్నారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీఎస్ఓ తనూజ

బినామీ డీలర్ల లెక్క తేల్చండి
- అధికారులకు డీఎస్ఓ ఆదేశాలు
- సిద్దిపేట పట్టణంలో ఆకస్మిక తనిఖీలు

సిద్దిపేటజోన్: జిల్లా వ్యాప్తంగా బినామీ డీలర్లు ఉంటే వెంటనే వారి సమగ్ర వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో బినామీ రేషన్ డీలర్ల గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే క్షేత్ర స్థాయిలో దుకాణాలు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యం తూకం విషయంలో, అలాగే సాంకేతిక పర లోపాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం నాణ్యత గూర్చి అరా తీశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, కౌన్సిలర్ అరవింద్ రెడ్డి, రేషన్ డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయిలో జరిగిన సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రజ్ఞాపూర్‌లోని విద్యానికేతన్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కాటా రాయప్ప తెలిపారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈనెల 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో 19 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా.. సిద్దిపేట జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. లాస్య, సంస్కృతి, స్నిగ్ధశ్రీ అత్యుత్తమ ప్రతిభ చాటరన్నారు. కాగా గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు బహుమతులు అందించి అభినందించారు.



బహుమతిని అందుకుంటున్న విద్యార్థినులు

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి
- అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజవాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గరీమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వచ్చే ప్రజల అర్జీలను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ విషయమై పురోగతి నివేదికను సమర్పించాలన్నారు. భూ సంబంధిత, ఇళ్లు, పెన్షన్లు, వంటి అంశాలపై మొత్తంగా 28 అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

భయం తొలగిస్తేనే గణితంలో రాణింపు
- విద్యార్థులను ప్రోత్సహించాలి
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- ప్రజ్ఞాపూర్‌లో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: గణితం అంటే కొందరికి ఇష్టం. మరికొందరికి భయమని, ఈ ఫోబియాను విద్యార్థుల్లో పోగొడితే... మరింత పట్టు సాధిస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష, బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థులకు గణితమంటే కఠినమైనదనే భావనకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. గణితంలో రాణించే వారు వినూత్నంగా ఆలోచించి అనుకున్న లక్ష్యాన్ని సునాయసంగా చేరుకుంటారని చెప్పారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయి పరీక్షల్లో తెలుగు మీడియానికి సంబంధించి నవదీప్‌కుమార్, భార్గవి, శివప్రసాద్, ప్రభు, నవ్య, ఇంగ్లీష్ మీడియంలో జశ్వంత్, అజయ్, సమీక్ష, మోడల్ పాఠశాలల విభాగంలో హాసిని, రిషితలు బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, తెలంగాణ మ్యాథ్స్ ఫోరమ్(టీఎంఎఫ్) బాధ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా టీఎంఎఫ్ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

'బయో ఎనర్జీ'కి అనుమతులు వద్దు



కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన

బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామా శివారులో నిర్మిస్తున్న గ్రీన్ వేస్ బయో ఎనర్జీ కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. అంతేకాక పశుపక్షాదులకు, మానవులకు హానీ జరిగే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలాలు సైతం కలుషితమవుతాయి. వెంటనే కంపెనీకి ఇచ్చిన ఎన్‌టీసీతో పాటుగా అనుమతులను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

విలువైన భూములను కాపాడండి



కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని చూపుతున్న బాధితులు

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి మీదుగా రోడ్డు వేయవద్దంటూ స్థానికులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి వల్ల విలువైన భూములు కోల్పోతున్నామని, భూములే జీవనాధారమని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల నుంచి సూర్యాపేట జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎంతో విలువైన భూములను ఎన్సాన్ పల్లి, బూర్గుపల్లి, తడ్కపల్లి, చిన్నగుండవెల్లి గ్రామాల రైతులు నష్టపోతారన్నారు. పలువురు నాయకులు వారి స్వలాభం కోసం రోడ్డు మ్యాప్‌ను మార్చారని, పాత మ్యాప్ ఆధారంగా రోడ్డు నిర్మాణం చేపట్టి తమ విలువైన భూములను కాపాడాలని కోరారు.

క్లుప్తంగా

ఫోన్ మాట్లాడుతూ..
ఐదో అంతస్తుపై నుంచి
కింద పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: నిర్మాణ దశలో ఉన్న భవనం ఐదో అంతస్తుపై నిలబడి ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన గణేష్ బతుకుదెరువు కోసం భార్యతో కలిసి హైదరాబాద్ కాచిగూడకు వచ్చి పెయింటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల నుంచి రామచంద్రాపురం పరిధిలోని వెలమెల గార్డియన్ స్కూల్ డి- బ్లాక్ వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పని చేసే చోట ఐదో అంతస్తుపై నుంచి ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఉసురుతీసిన
ఆర్థిక ఇబ్బందులు


సిద్ధరాములు (ఫైల్)

రామాయంపేట (మెదక్): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తొనిగండ్ల గ్రామానికి చెందిన మైసంగల సిద్దరాములు (50) కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై కుమారుడితో గొడవ పడిన సిద్దరాములు.. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మండలంలోని దామరచెరువు గ్రామశివారులో క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. వారు ఘటనా స్థలికి చేరుకొని సిద్దరాములును కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు.

గుండెపోటుతో
ఆటో డ్రైవర్ మృతి

వెల్దుర్తి(తూప్రాన్): ఓ ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బ్యాగరి లక్ష్మణ్(42) 20 ఏళ్లకు పైగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆటోల్లో ప్రయాణికులు చాలా తక్కువగా రావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం గుండెపోటుతో ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.


రెండో పెళ్లి చేసుకున్నాడని..

తూప్రాన్: రెండో పెళ్లి చేసుకున్న భర్తపై మొదటి భార్య ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శివానంద్ కథనం ప్రకారం.. హవేళి ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన షబానా 2019లో తూప్రాన్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్‌తో వివాహం జరిగింది. వీరికి కూతురు ఉంది. పెళ్లయిన మూడు నెలల నుంచే అత్తింటివారు వేధించడం ప్రారంభించారు. పెద్ద మనుషుల సమక్షంలో పలు మార్లు పంచాయితీ పెట్టించినా ఇమ్రాన్ కుటుంబంలో మార్పు రాలేదన్నారు. దీంతో 2022లో హవేళి ఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్య షబాన ఫిర్యాదు చేసింది. కామారెడ్డి కోర్టులో విడాకులు, మెయింటెనెన్స్ కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ లింగారెడ్డిపేటకు చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడని మొదటి భార్య షబాన ఫిర్యాదు చేసింది.

అధిక దిగుబడిపై ఆసక్తి

- 3102 రకం పట్ల రైతుల మొగ్గు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం

జహీరాబాద్ టౌన్: దీర్ఘకాలిక వాణిజ్య పంటల్లో చెరకు ప్రధానమైంది. పది నెలల నుంచి 12 నెలల్లో చేతికి వచ్చే పంటలో వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనేక రకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, మహారాష్ట్రలోని పూణే పరిశోధన స్థానాల నుంచి విడుదలైన పలు రకాలను రైతులు పండిస్తుంటారు. జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల రైతులు శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన రకాలను సాగు చేస్తున్నారు. శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో జహీరాబాద్ ప్రాంత రైతులు వాణిజ్య పంట అయిన చెరకు సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. అయితే.. చెరకు పంట సాగులో కష్టనష్టాలు అధికంగా ఉన్నాయి. విత్తనం నాటి నుంచి కర్మాగారానికి సరఫరా వరకు రైతులు తిప్పలు తప్పవు. దిగుబడి రాక.. గిట్టుబాటు ధర లేక.. పెట్టుబడులు రాని పరిస్థితులు ఉన్నాయి. సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావాలి.. కానీ ప్రస్తుత పరిస్థితుల వల్ల 25 టన్నులు దాటడంలేదు. దీంతో రైతులు అధిక దిగుబడి ఇచ్చే రకాల సాగుపై పట్ల ఆసక్తి చూపుతుంటారు. ప్రస్తుతం చెరకు సీజన్ కావడంతో రైతులు బిజీగా ఉన్నారు. ఈ సంవత్సరం నూతన వంగడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో అధిక శాతం కో 86032, కో 808005 రకాలను సాగు చేస్తున్నారు. వీటిలో చక్కెర శాతం వస్తుందని కర్మాగారాల యజమాన్యాలు వీటినే రెకమండ్ చేస్తున్నాయి. పెద్దగా లాభాలు లేకున్న నష్టంరాదన్న ఉద్దేశంతో తప్పని పరిస్థితిలో రైతులు ఈ రెండు రకాల పంటను పండిస్తున్నారు. పెట్టుబడులు పెరిగినా ఆశించిన లాభాలు రావడం లేదని కొంత మంది రైతులు కొత్త రకం సాగు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.


ఏపుగా పెరిగిన 3102 రకం చెరకు

3102 రకంపై మొగ్గు

రెండు సంవత్సరాల నుంచి కొంత మంది రైతులు అధిక దిగుబడినిచ్చే 3102 కొత్త రకం చెరకు పంట సాగు శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారం మూత పడటం పంట రకాల గురించి అడిగే వారు లేక అధిక దిగుబడినిచ్చే ఈ రకం సాగుకు సులభమైంది. కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాల యాజమాన్యాలు అన్ని రకాల పంటను తీసుకోవడం వల్ల నూతన వంగడం సాగుచేయడం ప్రారంభించారు. జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న కో 86032, కో 808005 రకాలు ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి వస్తున్నా.. పెట్టుబడులు ఎక్కువే. 3102 రకం అయితే 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు మొగ్గు చూపుతున్నారు. చెరకు ఏపుగా పెరుగుతుందని, ఎరువులు, కలుపు మొక్కల నివారణ ఖర్చులు తక్కువగా ఉంటున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొత్త రకం పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండడంతో విత్తనంకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం టన్నుకు రూ.5 వేలు పలుకుతుంది. రైతులు కొత్త రకం సాగుపట్ల ఆసక్తి చూపడంతో పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండు ఎకరాల్లో సాగు



ప్రస్తుతం సాగులో ఉన్న కో 86032, కో 808005 రకాలకు పెట్టుబడి అధికంగా ఉంది. అయినా ఆశించిన దిగుబడి రావడంలేదు. సంవత్సరం పొడుగు కష్టపడినా లాభాలు రావడంలేదు. అందుకే ఈ సంవత్సరం అధిక దిగుబడినిచ్చే 3102 రకం సాగు చేయాలని నిర్ణయించా. టన్నుకు రూ.5 వేల చొప్పున విత్తనం కొనుగోలు చేసి రెండు ఎకరాల్లో సాగుచేస్తున్న.

–డి. శివకుమార్, రైతు, ఎల్గోయి

చక్కెర శాతం తక్కువ

3102 రకం చెరకులో దిగుబడి కొంత అధికంగా ఉన్నా.. చక్కెర శాతం తక్కువగా ఉంది. ఇందుకుగాను కర్మాగారాల యాజమాన్యాలు ఈ రకం పంటకు రికమండ్ చేయడంలేదు. జహీరాబాద్ ప్రాంతానికి కో 86032, కో 808005 రకాలే అనువుగా ఉంటాయి. కర్మాగారాలు కూడా వీటినే సిఫార్సు చేస్తున్నాయి. మహారాష్ట్ర, కర్నాటక తదితర ప్రాంతాల కర్మాగారాల యాజమాన్యాలు అన్ని రకాల పంటను కొనేందుకు ఆసక్తి చూపడంతో కొంత మంది రైతులు కొత్త రకంపై ఆసక్తి చూపుతున్నారు.

–డాక్టర్ విజయ్‌కుమార్, శాస్త్రవేత్త,

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం
చేయాలి: సీఐటీయూ


సమ్మెనోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు

పటాన్ చెరు టౌన్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకొని హెల్త్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసులిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా సంఘాలు కలిపి దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఆశా వర్కర్లకు ప్రస్తుతం రూ. 9వేల పారితోషికం వస్తుందని, రెండు నెలల వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలుగా పని చేస్తున్నా వారికి ఫిక్స్‌డ్ వేతనం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తసుకోకపోవడం దారుణం అన్నారు. వారిని పెర్మనెంట్ చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 16న జరిగే సమ్మె ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు వైష్ణవి, పద్మ, హైమావతి, వీరమణి, అరుణ, నాగమణి, పుణ్యమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుడి వేధింపు

- పొరపడి వేరే ఉపాధ్యాయుడిపై యువకుల దాడి
- గ్రామంలో ఉద్రిక్తత


ఉపాధ్యాయులను నిలదీస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థినిపై ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన వ్యవహారంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. కొందురు యువకులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. స్థానిక నేతల సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. గ్రామానికి చెందిన ఓ విద్యార్థినిపై ఉపాధ్యాయుడు శనివారం అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలిపింది. ఆదివారం సెలవుకావడంతో విద్యార్థిని తల్లిదండ్రులు సోమవారం పలువురు గ్రామస్తులతో కలిసి స్కూల్‌కు వెళ్లి ఆ ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి వచ్చిన విద్యార్థి సంఘం యువకులు పొరపాటున మరో ఉపాధ్యాయుడిపై దాడిచేశారు. గ్రామస్తులు చెప్పినా వారు వినకుండా వారిపైనా దాడికి దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. రాజగోపాల్‌పేట పోలీసులు అక్కడికి చేరుకొని రెండు వర్గాల వారినీ సముదాయించారు. ఎంఈఓ దేశిరెడ్డి ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. స్థానిక నాయకులు జోక్యం చేసుకొని విద్యార్థినికి ఉపాధ్యాయుడితో క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది. బాలికపై అసంభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

టాస్క్‌లు, కమీషన్ల పేరుతో మోసం

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. 1 లక్షా 24 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గుడా సూర్యోదయ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు జనవరి 12వ తేదీన మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ. 2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈక్రమంలో బాధితుడు మొత్తం రూ.1 లక్షా 24 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్పూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంధం కొమ్ములో మరొకరు..

అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 28వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ. 88 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: అశ్లీల ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్‌కు కాల్‌కు భయపడి ఆన్‌లైన్‌లో రూ.50వేలు సమర్పించి మోసపోయాడు. ఈ సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. బాధితుడి కుటుంబ సభ్యుల న్యూడ్ ఫొటోలు తన దగ్గర ఉన్నాయని, వాటిని సోషల్ మీడియాలో పోస్టుచేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో ఫోన్‌పే ద్వారా రూ.50,000 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అలాగే.. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్రెడిట్ కార్డు లైఫ్ టైం ఫ్రీతో కూడిన లింకును గుర్తు తెలియని వ్యక్తి పంపించాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేసి తన బ్యాంక్, ఇతర వివరాలు, ఓటీపీ వివరాలు నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.29,070 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టమాటా.. లాభాల బాట

- నస్యరక్షణతో అధిక దిగుబడులు
- ముందస్తు చర్యలు ఎంతో మేలు
- వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ సూచనలు


టమాటా పంట సాగు

చిన్నకోడూరు(సిద్దిపేట): టమాటా అన్ని కాలాల్లో పండించే ముఖ్యమైన కూరగాయల పంట. టమాటాకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం రూ.20 వరకు ధర పలుకుతోంది. ప్రతి కూరలో టమాటా వేయడం పరిపాటి. ఈ పంట ఏడాదంత కాస్తుండటంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కనిపించేది టమాటే. అయితే టమాటాకు పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రైతులు ఎప్పటికప్పుడు పురుగు ఉధృతి ముందే గమనించి నివారణ చర్యలు చేపడితే ఎక్కువ దిగుబడులే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ సూచించారు.

ఆకుముడత తెగులు..

టమాటాలో ముఖ్యంగా ఆకుముడత తెగులు వ్యాప్తి చెందుతుంది. ఆకుల మీద , కాండం, కాయల మీద గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణ ఆకులు ఎండిపోతాయి. ఈ తెగులు ఎప్పుడైనా పంటను ఆశించవచ్చు. దీని నివారణకు మాంకోజెట్ 2 గ్రాములు లేదా కాప్టాన్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి 16 రోజుల వ్యవధిలో 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాలి. టమాటా పంటకు ఆశించే పరుగుల్లో పచ్చదోమ కూడా ఒకటి. ఆకులు అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకుల చివర్ల పసుపు పచ్చగా మారి క్రమేపి ఆకు అంతా ఎర్రబడిపోతాయి. దీని నివారణకు మిథైల్‌డెమటాన్ 2 మీ.లీ మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

కాయతొలుచు పురుగు...

కాయతొలుచు పురుగు ప్రధానమైంది. ఈ పురుగు పంటను ఆశించి ఆకులను కాయలను తినేస్తాయి. కాయలు తెంపే సమయంలో ఈ పురుగు తొలిచి నాశనం చేస్తాయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఒక్కో సమయంలో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి వస్తుంది. దీని నివారణకు పంటలో బంతి మొక్కలు వేసుకోవాలి. పురుగు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ మందు పిచికారీ చేసుకోవాలి. అదేవిధంగా ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుంటే మంచిది.

వైరస్‌తో మొక్కలు గిడుసుబారి..

రెండు రకాల వైరస్‌లు ఎక్కువగా సోకుతాయి. టుబాకో మొజాయిక్, స్పాటెడ్ విల్ట్ వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. ఈ వైరస్ సోకడం వల్ల మొక్కలు గిడుసుబారి, పూత పిందె ఎండిపోతాయి. తామర, పేను బంక పురుగుల నివారణకు డైమిథోయేట్ 2 మీ.లీ. ద్రావణం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

సారుకు సోమవారం సెలవట!

- వివరణ కోరితే సెలవిచ్చారని సమాధానం
- మెమో జారీ చేసిన ఎంపీఓ హరి

సిద్దిపేటరూరల్: సారుకు సోమవారం సెలవేంటని ఆలోచిస్తున్నారా? అవునండి నిజమే. మండల పరిధిలోని మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక పంచాయతీ కార్యదర్శి ప్రతీ సోమవారం సెలవులో ఉంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాల్సిన పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఏదో ఒక కారణం చెబుతూ విధులకు దూరంగా ఉంటున్నాడు. కార్యాయాలనికి వస్తున్న ప్రజల పనులు కాకపోవడంతో అసలు విషయం బయటపడింది. ఇతను మూడేళ్లుగా చింతమడక కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ సోమవారం కార్యాలయానికి రాకుండా వ్యక్తిగత పనులపై మరో ప్రాంతానికి వెళ్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. కార్యదర్శి సురేశ్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా తనకు ప్రతీ సోమవారం సెలవిచ్చారని సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీఓ హరిని వివరణ కోరగా గత సోమవారం సెలవులో ఉన్నాడని, ఈవారం సెలవులో లేరని వివరణ ఇచ్చారు.

గ్రామాన్ని సందర్శించిన ఎంపీఓ

చింతమడక నర్సరీని ఎంపీఓ తనిఖీ చేశారు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేరు. అతడికి ఫోన్ చేయగా ఇంటికి వెళ్తున్నానని, 15 నిమిషాల్లో వస్తానని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు వేచి చూసినప్పటికి కార్యదర్శి రాలేదు. కార్యాలయ పనివేళల్లో లేకపోవడంపై మంగళవారం రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఎంపీఓ మెమో జారీ చేశారు.

రైతు రాజైతే దేశం సుభిక్షం

భారతీయ కిసాన్ సంఘ్
రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి


సభ్యత్వ రశీదు అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని, రైతే రాజైతే దేశం సుభిక్షంగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సీతారామచంద్ర స్వామి కల్యాణ మండపంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతీయ కిసాన్ సంఘ్ పార్టీలకతీతంగా రైతులను సంఘటిత పరిచి బలమైన శక్తిగా తయారు చేయడమే కాకుండా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. జిల్లాలో 50 వేల రైతుల సభ్యత్వ నమోదును పార్టీలకతీతంగా ఈనెల 20వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, లింగుపల్లి సర్పంచ్ జోగ్యారి బాల్‌నర్సింహులు, ఎంపీటీసీ సుతారి నర్సింహులు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శులు బోరంపేట మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కూరెల్లి జస్వంత్ రెడ్డి, జిల్లా రెవెన్యూ ప్రముఖ్ మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా ప్రముఖ్ గూడెపు నిర్మల, సేంద్రియ వ్యవసాయ జిల్లా ప్రముఖ్ సత్తు రాజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నేరండ్ల భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు పాట్లు

- పంట చుట్టూ చీరల ఏర్పాటు
- రైతుల వినూత్న ఆలోచనలు


పొట్టిపల్లి గ్రామ శివారులో జొన్న పంట చుట్టూ ఏర్పాటు చేసిన చీరలు

ఝరాసంగం (జహీరాబాద్): పంటల సాగుకు వాతావరణంతో పాటు జంతువుల బెడద తప్పటం లేదు. వాతావరణం అనుకూలించి పంటలు సాగు చేసినా రైతులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలను జంతువులు, పశువుల నుంచి కాపాడుకునేందుకు అనేక రకాలుగా పాట్లు పడుతున్నారు. పంట సాగు చేసేందుకు విత్తనం విత్తిన నాటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అడవిపందులతో పాటు పక్షుల బెడద అధికంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినూత్న ఆలోచనల ద్వారా పంట రక్షణ

జిల్లాలో రైతులు తాము సాగు చేసిన పంటలన కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచనలు చేసి కొంత మేర రక్షించుకోగలుగుతున్నారు. పాత చీరలతో పంటపొలం చుట్టూ కంచె మాదిరిగా ఏర్పాటు చేస్తున్నారు. రంగురంగుల చీరలు కంచె మాదిరిగా ఏర్పాటు చేయటంతో అడవి పందుల బెడద నుంచి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. ఖాళీ నీటి బాటిళ్లు, గాజు సీసాలతో పంట చుట్టూ ఏర్పాటు చేశారు. గాలులు వీచిన సమయంలో వచ్చే శబ్దంతో పక్షులు బెడిసి పారిపోతున్నాయని రైతులు వెల్లడించారు. మరికొంత మంది రైతులు మెమోరికార్డు కలిగి ఉన్న మైకుల శబ్దంతో పక్షుల బెడద తగ్గిందంటున్నారు. ఆయుర్వేదిక మందులు వాడిన ఇంజన్‌ఆయిల్‌తో కలిపి పంట చుట్టూ చీరతో కట్టడం ద్వారా అడవి పందులు పంట నుంచి దూరంగా పోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ విధంగా రైతులు తమకు వచ్చిన ఆలోచనలతో పంటలను కొంత మేర కాపాడుకోలుగుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.


బోరెగాం శివారులో రక్షణగా ఏర్పాటు చేసిన ఖాళీ వాటర్ బాటిళ్లు

చీరలతో పంటల రక్షణ



రెండు ఎకరాల విస్తీర్ణంలో జోన్న పంటను వేశాను. జోన్న పంటకు అడవి పందుల బెడదతో పాటు పక్షుల బాధ ఉంది. వాటి నుంచి కాపాడుకునేందుకు పంట చుట్టూ చీరలను ఏర్పాటు చేశా. దీంతో కొంత మేర పంటను రక్షించుకుంటున్నాం.

–జగన్నాథం, రైతు, పొట్టిపల్లి

ఆర్టీసీ బస్సు ఢీకొని
విద్యార్థి మృతి


శ్రీకాంత్(ఫైల్)

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని పస్తాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సాక్షుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఈప్తి శ్రీనివాస్ కుమారుడు శ్రీకాంత్(18) పస్తాపూర్ పరిధిలోని ఆర్ఎల్ఆర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే సోమవారం తన టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కాలేజీకి వెళ్లాడు. కళాశాల గేటు సమీపానికి రాగానే జహీరాబాద్ నుంచి న్యాల్‌కల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.